www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024



కలెక్టర్‌ను కలసిన జెడ్పీ సిఈఓ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లా పరిషత్ సిఈఒగా బాధ్యతలు స్వీకరించిన గ్లోరియా గురువా రం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలెక్టర్ షన్మోహన్ ను గురువారం కలసి కృతజ్ఞలు తెలిపారు. జిల్లా పరిషత్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్‌తో చర్చించారు.



కలెక్టర్ షన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జెడ్‌పి సీఈవో గ్లోరియా

పాత పెన్షన్ ఇచ్చే వారికే ఓట్లు..

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సిపిఎస్, జిపిఎస్ విధానాలు కార్పొరేట్‌లకు లాభాలు వచ్చే విధానాలు మాత్రమే నని, పాత పెన్షన్ మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయుల, ప్రజలకు లాభం అని, పాత పెన్షన్ ఇచ్చే పార్టీలకే ఓట్లు వేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. చిత్తూరు జిల్లా యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయిన ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనవరి 28వ తేదీ రాజమండ్రిలో వేలాది మందితో 'ఓట్ ఫర్ ఓపిఎస్' నినాదంతో సదస్సు నిర్వహించారని తెలిపారు. ఈ సదస్సుకి సీపీఎం, సీపీఐ, ఆమాద్మీ, బిఎస్పీ మాత్రమే హాజరై పాత పెన్షన్ మేనిఫెస్టోలో పెడతామని చెప్పారని, వారందరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు. మిగిలిన పార్టీలు ఇంతవరకు వారి వైఖరి స్పష్టం చేయకపోవడం సరి కాదని తెలిపారు. సీపీఎస్, జిపిఎస్ విధానంలో ఎన్ఎస్డిఎల్‌లో సొమ్ముని కుదవ పెట్టడం ద్వారా ఉపాధ్యాయులకు ఎలా లాభం వస్తుందో ప్రభుత్వాలు చెప్పాలని డిమాండు చేశారు. గతంలో పిఎఫ్ఆర్డిఏ చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్, మిగిలిన రాజకీయ పార్టీలు రాష్ట్రాల్లో ప్రజా పోరాట ఫలితంగా నేడు ఓపిఎస్ విధానం తిరిగి వస్తోందని తెలిపారు. ప్రజా పోరాటాలకు , ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేసేందుకు పార్టీలు సిద్ధం కావాలని సూచించారు. కార్పొరేట్‌ల లాభాల కోసం సృష్టించిన సిపిఎస్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని డిమాండు చేశారు. యుటిఎఫ్ పిలుపును ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. రాష్ట్రంలో 14 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలు భవిష్యత్తులో కొనసాగించుకోవడం కష్టమైన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ పాఠశాలలలో మరొక ఉపాధ్యాయుడిని నియమించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తక్కువ మంది ఉపాధ్యాయులకు నోటిఫికేషన్ ఇవ్వటం సరికాదన్నారు. ఇప్పటికైనా పున: పరిశీలించి ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయో? ఒక స్పష్టమైన గణాంకాలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం వద్ద ఉంచిన డిమాండ్స్, ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 2023 నుంచి ఐఅర్30 శాతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ దశలవారీ పోరాటానికి పిలుపు నిచ్చినా ప్రభుత్వం స్పందించ లేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పోరాటం చేసి వెట్టి చాకిరీ విధానమైన అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకున్నామని, మళ్లీ ఇప్పుడు 2024 డిఎస్సిలో తిరిగి అప్రెంటిస్ విధానం ప్రవేశపెట్టడం సరికాదన్నారు. అప్రెంటిస్ విధానం లేని పూర్తి స్థాయి వేతనంతో కూడిన డిఎస్సిని పాటించాలని కోరారు. యుటిఎఫ్ చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంసోమశేఖర్ నాయుడు, ఎన్‌మణిగండన్ మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేసి కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నామని, భవిష్యత్తులో పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకుంటామని, అందరూ యూటీఎఫ్ చేసే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు పి ఆర్ మునిరత్నం , ఎస్ రెహానా బేగం, నాయకులు రెడ్డెప్ప నాయుడు, దీనావతి, ఎస్ పి బాషా, ఏకాంబరం, సరిత, పార్థసారథి, ఎం వి రమణ, వంశీ కృష్ణ , మునికృష్ణయ్య, రాజేంద్ర, చంద్ర, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్ షన్మోహన్

26న ముఖ్యమంత్రి పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, రామకుప్పం: ఈనెల 26వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుప్పం నియోజకవర్గం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పర్యటించనున్న నేపథ్యంలో అందు కు సంబంధించి బహిరంగ సభ, హెలి ప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్ ఎస్ షన్మోహన్ చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డప్పతో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లాలోని రామకుప్పం మండలం రాజుపేటలో హెలిప్యాడ్, శాంతిపురం మండలం గుండు శెట్టి పల్లిలో హెలిప్యాడ్ ఏర్పాటు, బహిరంగ సభ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.

పటిష్ట బారికేడింగ్ ఏర్పాటుకు చర్యలు

హెలిప్యాడ్ వద్ద పటిష్టమైన బారి కేడింగ్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ సెంథి ల్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, డిఎస్పీ శ్రీనాథ్, సంబంధిత మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టులు దారుణం

సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించాలని కోరుతూ ప్రశాంతంగా ఆందోళన నిర్వహిస్తున్న పిసిసిఐ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలని, జిల్లాలో కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరసన తెలిపేందుకు 'చలో విజయవాడ'కు కార్యకర్తలు రాకుండా ముందస్తు అరెస్టులు చేయడం, వైసిపి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు ఊరట కల్గించాలని ఆయన డిమాండు చేశారు.

అటకెక్కిన భూ పంపిణీ

- పట్టించుకోని పాలకులు
- రెండో విడత భూ పంపిణీ కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి - వి కోట: భూమి లేని నిరుపేదలు ప్రభుత్వ భూములను చదును చేసుకుని అసైన్మెంట్ పట్టాల కోసం అన్నదాతలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. గుట్ట..చెట్టు...రాయి.. రప్పా..తొలగించి సాగుకు యోగ్యంగా మలుచుకున్న భూములకు పట్టాల కోసం దరఖాస్తు చేశారు. జాబితాలు సిద్ధమయ్యాయి..అసైన్మెంట్ కమిటీ ఆమోదమే తరువాయి..అధికారులు బదిలీ అయ్యారు..ప్రక్రియ ఆగిపోయింది.. అన్నదాతల్లో ఆందోళన నెలకొంది..పట్టాలు ఇస్తారా.. ఉసూరు మనిపిస్తారా..? అసైన్మెంట్ కమిటీ పైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్లో అసైన్మెంట్ భూముల పట్టాల పంపిణీ ప్రక్రియ అర్థాంతరంగా ఆగిపోయింది. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ పంపిణీ నిర్వహించింది. ఆ సందర్భంలో పలువురు రైతులకు సమాచారం తెలియక దరఖాస్తు చేసుకోలేదు. మండలాల వారీగా 50 నుంచి 20 మంది రైతులు మాత్రమే పట్టాలు పొందారు. ఈ విషయమై అర్హులైన పలువురు రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూ పంపిణీ ద్వారా పట్టాలు పంపిణీ చేయాలని మొరపెట్టుకున్నారు. దీంతో రెండో విడత అర్హులైన రైతుల జాబితా సిద్ధం చేయాలని మండల తహశీల్దార్లను వారు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో అధికారులు అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలించి జాబితాలు సిద్ధం చేశారు. జిల్లా అసైన్మెంట్స్ కమిటీ దృష్టికి జాబితాలు వెళ్లాల్సి ఉంది. ఇంతలో సాధారణ ఎన్నికల విధుల్లో భాగంగా తహశీల్దారులను బదిలీ చేశారు. దీంతో భూ పంపిణీ ప్రక్రియ అర్థాంతరంగా ఆగిపోయింది. రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 1500 మంది రైతులు దరఖాస్తు భూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్త తహశీల్దార్లు బాధ్యతలు చేపట్టారు. అసైన్మెంట్ కమిటీ సభ్యుల వద్దకు సంతకాల కోసం జాబితాను తీసుకుపోవాల్సి ఉంది. అయితే తమకేమీ పట్టనట్టు ఎన్నికల పనుల్లో తహశీల్దారులు నిమగ్నమయ్యారు. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. పట్టాలు వచ్చేస్తాయనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేదలకు భూ పంపిణీ ద్వారా పట్టాలు ఇచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా ఆ ప్రక్రియను ఎలాగైనా పూర్తి చేసి పేద రైతులకు లబ్ధి చేకూర్చాలని సంకల్పంతో ముందుకెళుతున్నారు. ప్రస్తుతం భూ పంపిణీ ప్రక్రియ స్తబ్దంగా ఉంది. ఇకనైనా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, కలెక్టర్ స్పందించి ఎన్నికల లోపు భూ పంపిణీ ద్వారా పేద రైతులకు పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని రైతన్నలు కోరుతున్నారు.



రైతులు సాగుచేసుకుంటున్న భూములు



రెండు ఎకరాల భూమికి పట్టా ఇప్పించాలి

రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని పూర్వీకుల నుండి సాగు చేసుకుంటున్నాం.. దరఖాస్తు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నాం.. జాబితాలో మా పేరు ఉంది. పట్టా కోసం ఎదురు చూస్తున్నాం.. ప్రభుత్వ పెద్దలు , అధికారులు స్పందించి ఎన్నికల కోడ్ రాకముందే తమకు పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

- బాలసుబ్రహ్మణ్యం, రైతు, వెంకటేపల్లి.

భూ పంపిణీ సత్వరం పూర్తి చేయాలి



జేసి ఆదేశం కోసం నిరుపేద రైతుల నిరీక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల బతుకుల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ఎన్నో సంవత్సరాల నిరీక్షణ అనంతరం చేపట్టిన భూ పంపిణీని సత్వరం జిల్లాలో పూర్తిచేసి రైతులకు న్యాయం చేయాలి. ఎన్నికల కోడ్ రాకముందే జెసి స్పందించి రెండో విడత భూపంపిణీ పై దృష్టి సారించి సత్వరం రైతులకు సహాయం చేయాలి.

- నాగరాజు, రైతు, కొమ్మరమడుగు.

రైతులు విలవిల

- గిట్టు బాటు ధరలేక బంతిపూలు ఏటి పాలు
- పొలాల్లోనే వదిలేస్తున్న వైనం
- పూల సాగుపై అనాసక్తత

ప్రజాశక్తి -గంగవరం: బంతిపూల ధరలు పూర్తిగా పతనం కావడంతో చేతికొచ్చిన పంటలను విధులేని పరిస్థితిలో రైతులు ఏటిలో పడవేయడం బాధాకరంగా ఉందని రైతు ప్రభాకర్ అన్నారు. మండలంలోని పడమటి పంచాయతీలు అయిన కీలపల్లి, బాలేపల్లి, పత్తికొండ, గంగ్రాజు పల్లి, గుండిగల్లు, పసపత్తూరుతో పాటు పలు గ్రామాల రైతులు సీజన్ వారి పంటలలో భాగంగా ఈ ఏడు అధికంగా బంతిపూల పంటలు సాగు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. రైతు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నెల రోజుల క్రితం సంక్రాంతి పండుగ సందర్భంగా బంతిపూలు కిలో 50 రూపాయలు పలికిందని ప్రస్తుతం కిలో ఐదు రూపాయల పటకడంతో పంటను చూసి దు:ఖం ఓర్చుకోలేక పూలను చెట్ల నుండి తొలగించి పక్కనే ఉన్న కౌండిన్య నదిలో పారవేశామని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం పూల పంట పండించడానికి ఎకరాకు 80 వేల నుండి లక్ష రూపాయల దాకా ఖర్చవుతోందని 50 రూపాయలు చొప్పున కిలో ధర పలికితే ఖర్చులు పోను 50 వేల నుండి లక్ష రూపాయల దాకా గిట్టుబాటు అయ్యేదని ప్రస్తుతం ధర లేక పోవడంతో పెట్టుబడి కూడా చేతికందక నిరాశతో పూలను పొలాలల్లోనే విడిచి పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. కనీసం పూలను వేరు చేసే కూలీలకు ఇచ్చే కూలి డబ్బు కూడా చేతికి రాదని ఊహించిన రైతులు అలాగే వదిలివేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. తాను గిట్టుబాటు ధర లేక బంతిపూలను ఏటిలో పడేసినట్లు సుబ్రహ్మణ్యం తెలిపాడు. బంతిపూలుధరలు లేకపోవడంతో పొలంలోనే వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



ధరలేక పొలాల్లోనే వదిలేసిన బంతిపూల చెట్లు



బంతిపూలను ఏటిలో పారబోసిన రైతులు

ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వండి: ఫ్యాప్టో


ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులను నియమించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే కొందరికి మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో నాయకులు జిల్లా రెవెన్యూ అధికారికి గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులను నియమించడాన్ని స్వాగతిస్తున్నామని అయితే ప్రత్యేక ప్రతిభా వంతులు, దీర్ఘకాలిక వ్యాధులు , వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా చంటి బిడ్డలు కలిగిన మహిళ ఉపాధ్యాయినులు, గర్భిణులు దూరప్రాంతాలకు వెళ్లి ఎన్నికల విధులు నిర్వహించలేరని ఇలాంటి వారికి ప్రధానంగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. 23,24 తేదీల్లో ఇలాంటి వారు సుదూర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చి పరిశీలన నివేదిక సమర్పించుకోలేరని ఇలాంటి వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు మునాఫ్, హేమాద్రి, గోపీనాథ్, మునీర్ అహ్మద్, రామ్మూర్తి, జీవి రమణ, దేవరాజు రెడ్డి, కిరణ్ కుమార్, రమేష్ లు పాల్గొన్నారు.



డిఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరులో అధికార, ప్రతిపక్షాల వ్యూహం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎన్నికల నోటిఫికేష్ దగ్గర పడుతున్న కొద్ది ఇరు పార్టీలు ప్రచార జోరును పెంచేశాయి. అధికార పార్టీ విజయానందరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో జెట్ స్పీడ్‌తో దూసుకు పోతున్నారు. ప్రతిపక్ష టిడిపి నుండి చిత్తూరు స్థానాన్ని ఐదుగురు అభ్యర్థులు ఆశిస్తున్నారు. వీరిలో టికెట్ ఎవరికి ఇవ్వాలనే విషయంలో అధిష్టానం తీవ్ర ఆలోచనలో పడింది. అనూహ్యంగా తెరపైకి వచ్చిన గురజాల జన్మోహన్ అధికార పార్టీ అభ్యర్థికి ఏమాత్రం తీసిపోని విధంగా ప్రచారం చేస్తున్నారు. టిడిపి నుండి ఐదుగురు అభ్యర్థులు చిత్తూరు నుండి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నా గురజాల జగన్మోహన్ పేరు ముందు వరుసలో ఉన్నట్లు పార్టీ వర్గల సమాచారం. మరో వైపు బలిజలకు చిత్తూరు స్థానం ఇవ్వాలని బలిజలు కోరుతున్నారు. ఏదిఏమైనప్పటికీ 2024 ఎన్నికల్లో చిత్తూరు నియోజవర్గం అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోటీ హోరాహోరీ కానుంది.



అభ్యర్థి ప్రకటన ఆలస్యం

చిత్తూరు టిడిపి అభ్యర్థిని ప్రకటించడంలో అధిష్టానం ఆలస్యం చేయడం టిడిపికి కలసి వస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అభ్యర్థి ప్రకటన ఆలస్యం చేయడం వల్ల పార్టీ ఫిరాయింపులు తగ్గుతాయని భావిస్తున్నారు. బలిజల్లో అధికారి పార్టీపై ఉన్న వ్యతిరేకత టిడిపికి కలిసి వస్తుందని భావిస్తోంది. ప్రచారంలో అధికార పార్టీతో ఏమాత్రం తీసిపోని విధంగా దూసుకుపోతున్న టిడిపి అధిష్టానం ఎవ్వరికి టికెట్ ఇచ్చినా సమిష్టిగా విజయం కోసం కృషి చేస్తామని ప్రకటిస్తోంది. పక్కా ప్లాన్‌తోనే టిడిపి సీట్ల కేటాయింపులో ఆలస్యం చేస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుప్పం మినహా అన్ని స్థానాల్లో ఓటమిపాలైంది. ఈ ఎన్నికల్లో జిల్లాలో టిడిపి ప్రాభల్యాన్ని పెంచుకొనేలా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని లోకేష్ పాదయాత్ర, చంద్రబాబు బహిరంగసభ, నారా భువనేశ్వరి నాయకత్వానికి దిశానిర్దేశం చేస్తున్నారు. మరో వైపు 35 సంవత్సరాలుగా కుప్పంలో తిరుగులేని మెజార్టీతో చిత్తూరు పార్లమెంట్‌ను కైవశం చేసుకుంటున్న టిడిపి గత ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ స్థానం కోల్పోవాల్సి వచ్చింది. చిత్తూరు పార్లమెంట్‌కు ధీటైన అభ్యర్థిని బరిలో దింపాలనే

గెలుపు ధీమాలో ఇరుపార్టీలు

అలోచనలో చిత్తూరు పార్లమెంట్ స్థానం అభ్యర్థి ప్రకటన ఆలస్యం చేస్తోందని జిల్లా నాయకత్వం అంచనా వేస్తోంది.

నియోజవర్గ ఓట్లు ఇలా..

చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలున్నాయి. ప్రస్తుతం చిత్తూరు రూరల్, గుడిపాలలో టిడిపికి ఎంపిటీసీలు, సర్పంచ్‌లున్నారు. జెడ్పిటిసి స్థానాలన్ని అధికార పార్టీవే.... 50 కార్పొరేట్ స్థానాలున్న నగర పాలక సంస్థలో ముగ్గురు కార్పొరేటర్లు మాత్రమే ప్రతిపక్ష తెలుగుదేశానికి వున్నారు. గురజాల స్వంత మండలం గుడిపాల కావడంతో స్థానికత కలిసి వచ్చే అవకాశమున్నట్లు భావిస్తున్నారు. ఇక చిత్తూరు నియోజకవర్గంలో 2 లక్షలా 1,741 ఓటర్లున్నారు. ఇందులో పురుషులు లక్షా 30వేల 23, స్త్రీలు రెండు లక్షలా 822 ఉన్నారు. కులాల వారిగా ఎస్సీ, ఎస్టీ లు 41,199, బలిజ 27,668, కమ్మ 18,082, రెడ్డి16,950, వన్నీకుయకుల 13,995, ముస్లీమ్ మైనార్టీలు 12,869, వైశ్య 7, 2382, మొదిలియార్ 7,242, యాదవ 7,171, ఈడిగ, 4,714, షెడ్యూల్ తెగలు 4, 412, గాండ్ల 4,070, ముత్తరాశి 3,655, క్రిష్టియన్లు 3,636, వడ్డెర 2,720, బ్రాహ్మనులు 2,384, కంశాలి 2,276, మంగలి 1,652, పిళ్లై 1,785, చాకలి 1,459, కుమ్మరి 1,296, పద్మశాలి 1,24, బెస్త 896, కురబ 766, బోయ 458, లింగాయత్ 420, వెలమ 406, వెలమ 374, క్షత్రియ 261, గౌడ్ 126, ఇతరులు 261ఉన్నారు. వయసు రీత్యా చూస్తే 18 నుంచి 19 లోపు 4,149, 20 నుంచి 29 లోపు 33, 855 మంది, 30 నుండి 39 లోపు 5,433 మంది, 40 నుండి 49 లోపు 45,829, 50 నుండి 59 లోపు 33,184 మంది, 60 నుండి 69 లోపు 20,285, 70 నుండీ 79 లోపు 1,196, 80 నుండి 89 లోపు 2,601, 90 నుండీ 99 లోపు 287 మంది 100 నుండీ 109 వరకు ఇద్దరున్నారు.



మాట్లాడుతున్న నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ జాన్ శామ్యూల్ కిమ్

రేపు మాదక ద్రవ్యాల నిషేధంపై ర్యాలీ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: డ్రగ్స్, మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థుల్లో అవగాహన నిమిత్తం ఈ నెల 24న చిత్తూరులో 'స్టూడెంట్స్ ఎన్ టైటిల్మెంట్ ర్యాలీ ఫర్ యాంటీ డ్రగ్స్' చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ జాన్ శామ్యూల్ కిమ్ తెలిపారు. చిత్తూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోందన్నారు. భావితరాలైన యువతడ్రగ్స్ బారిన పడిన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థుల్లో అవగాహన కలిగించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఈనెల 24న చిత్తూరులోని శర్మన్ బాలికోన్నత పాఠశాల నుంచి ర్యాలీ ప్రారంభమై, పిసిఆర్ కళాశాల, మిట్టూరు, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా సర్కిల్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, చర్చివీధి, విజయలక్ష్మీ థియేటర్ రోడ్డు, గాంధీ రోడ్ ఎక్స్టెన్షన్, పాత కోర్టు మీదుగా గాంధీ విగ్రహ కూడలి వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. అక్కడ ముగింపు ప్రసంగం ఉంటుందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, న్యాయ సేవా సదన్ అధికారులను ర్యాలీలో పాల్గొనాలని సంప్రదించామని పేర్కొన్నారు. యువత, వివిధ సంఘాలు , ప్రజలు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంస్థ న్యాయ సలహాదారు విజయకుమార్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జోబ్, జాతీయ డైరెక్టర్ నాగరాజు రెడ్డి, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

కార్యాలయ మరమ్మతులకు జిజేఎం విరాళం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా టిడిపి కార్యాలయ అత్యవసర మరమ్మతుల కోసం జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ లక్ష రూపాయల విరాళాన్ని అందించినట్లు చిత్తూరు పార్లమెంటరీ నాయకులు కోదండయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 ఒక లక్ష రూపాయలు చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయం పేరుతో ఉన్న బ్యాంక్ జాయింట్ ఖాతాలో జమ చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురజాల జగన్మోహన్ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కుప్పం విద్యాసంస్థల వార్షికోత్సవం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కుప్పం విద్యాసంస్థల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి సి ఎన్ విద్యా సంస్థల అధినేత బి సి నాగరాజు, ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజు హాజరు కాగా విశిష్ట అతిథిగా ద్రవిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కార్యక్రమంలో తొలుత పాఠశాలలో వివిధ పోటీలలో రాణించిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. చివరగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బిసిఎన్ విద్యాసంస్థల ముఖ్య కార్యాలయ నిర్వహణ అధికారి డాక్టర్ సాగర్ రాజు, కుప్పం పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -సోమల: ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఈనెల 27వ తేదీ తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి సభకు రానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని దళిత వాడల నుండి అధిక సంఖ్యలో యువకులు దళితులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రామనాథం కోరారు. శనివారం సోమలలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ రాక సందర్భంగా అధిక సంఖ్యలో దళితులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ యువసేన అధ్యక్షులు మాటూరి మురళి మాట్లాడుతూ దళితుల కోసం దళిత హక్కుల కోసం అభినవ అంబేద్కర్ లా పోరాడుతున్న మందకృష్ణ మాదిగ కు మండలంలోని దళితులంతా ఘన స్వాగతం పలికే విధంగా తిరుపతికి తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ప్రభు కుమార్, మాజీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మొగిలి శ్వర, వెంకటరామయ్య, మనీ, లక్ష్మీపతి, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభా వంతులకు జాబ్ మేళా

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు జిల్లా పిడబ్ల్యుడి ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్, పలమనేరు వికలాంగుల సేవా సమితి ప్రెసిడెంట్ చిన్న గుర్రప్ప., రాష్ట్ర పిడబ్ల్యుడి ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జాబ్ మేళా నిర్వహించడం జరిగినది. ఈ జాబ్ మేళాకు దాదాపు నూరు మందికి పైగా ప్రత్యేక ప్రతిభావంతులు హాజరయ్యారు. ఇందులో దాదాపుగా 70 మందికి ఉద్యోగాలు బెంగళూరు, తిరుపతి , చిత్తూరు ,రాయచోటి , మదనపల్లి ఏరియాలలో పొందినట్లు ధ్రువీకరించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసిసి సభ్యుడు పలమనేరు కాంగ్రెస్. నియోజకవర్గ ప్రతినిధి పార్థసారధి రెడ్డి, మాట్లాడుతూ వికలాంగులకు సరైన గుర్తింపు, గౌరవం ఇవ్వాలని సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వికలాంగులకు సరైన గుర్తింపు సహాయం సంక్షేమ పథకాలు అందించడం లేదని మంచి వారికే అన్ని పథకాలు వర్తించే విధంగా సంక్షేమ పథకాలు ఉన్నాయని ,రాబోవు రోజుల్లో తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు అన్ని విధాల మెరుగైన సంక్షేమ పథకాలతో సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమము లో రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు రామచంద్రారెడ్డి మరియు కార్యవర్గ సభ్యులు షణ్ముగం శెట్టి పాల్గొన్నారు. తమ క్లబ్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పినారు. వికలాంగులకు కూడా తమ క్లబ్ తరపున చేతనైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు .

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకమ్మనపల్లిలో విద్యార్థులకు వృత్తి విద్యా కోర్స్ ల పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నైన్త్ క్లాస్ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను ప్రిన్సిపాల్ టి ఎస్. అనిత వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కార్తీక్, కే. మురళీ మోహన్, జి. మురళీ కుమార్, ఆర్. జయశంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నారు. గంగవరం మండలంలోని మదర్ థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల లో నైపుణ్యం శిక్షణ తరగతులను పరిశీలించేందుకు కమ్మనపల్లి ఆదర్శపాఠశాల పాఠశాలలో9 తరగతి ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుల సహాయంతో గంగవరం మండలంలోని మదర్ థెరిసా ఇన్స్టిట్యూట్ కళాశాలకు గురువారం చేరుకొని ఒకేషనల్ ఎడ్యుకేషన్ సంబంధించిన ఒకేషనల్ కో ఆర్డినేటర్స్ పీ.నాగరాజు , వృత్తి విద్యా శిక్షకుడు కె.సురేష్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఎంపీడీవో రాజేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల ప్రజా పరిషత్ బైరెడ్డిపల్లి కార్యాలయంలో గతంలో ఎంపీడీవో గా పని చేస్తున్న ప్రభాకర్ రెడ్డి జిల్లా ఏవోగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంతో స్థానిక ఈవోఆర్ డి రాజేంద్ర బాలాజీ ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా కొనసాగారు. ఎలక్షన్లను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం పలమనేరులో ఏవోగా పనిచేస్తున్న జి రాజేష్ బైరెడ్డిపల్లి ఎంపిడిఓ గా ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం మండల ఎంపీడీవో గా వారు బాధ్యతలు చేపట్టారు. వారికి ఎం పి పి మొగసాల రెడ్డప్ప , ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది అతనికి ఘన స్వాగతం పలికారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో అభ య ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా వాటం బేడు బ్రదర్స్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శివకుమార్, హరికుమార్, రత్నకుమార్, నాగేశ్వరరావు, శ్రీవర్ధన్‌రెడ్డి, శంకర్‌సుబ్బారావు, పెంచలయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్‌కి సన్మానం

ప్రజాశక్తి-గూడూరురూరల్:

సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ ఆసుపత్రి డాక్టర్ ఎస్.సుందర్ కుమార్‌కు సీనియర్ డివిజన్ మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. డీఆర్‌యు సీసీ సభ్యులు రోటరియన్ డాక్టర్ శ్యామసుందరరావు ఈ సందర్భంగా గురువారం సుందర్ కుమార్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

తుడా స్థలంలో ప్రవేశించొద్దు: రవీంద్రయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం రామచంద్ర నగర్ వద్ద ఉన్న బొంతలమ్మ ఆలయం రోడ్డు విస్తరణలో భాగంగా దెబ్బతినే ప్రమాదం ఉండటంతో ఆలయానికి అనుకొని ఉన్న తుడా కాలి స్థలాన్ని ఆలయ నిర్వహణకు వినియోగించు కోవడానికి గ్రామస్తులు ప్రయత్నించడంతో తుడా అధికారులు అడ్డుకున్నారు. చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 176/2లో గల రెండు ఎకరాల తుడా స్థలంలో కొంత భాగం వినియోగించుకోవడానికి స్థానిక గ్రామస్తులు చేసిన ప్రయత్నాన్ని తుడా అధికారులు అడ్డుకోవడంతో గ్రామస్తులు తుడా చైర్మన్, తుడా విసికి సమస్యను వినతి రూపంలో విన్నవిస్తామని అక్కడ నుండి వెళ్లిపోయారు.

మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వాయులింగేశ్వర మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.షాహీర్, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా కేహెచ్ ప్రసాద్‌లు ఎంపికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా జుంలేషా, కోశాధికారిగా హుమాయున్, ఉపకార్యదర్శులుగా శరత్, శంకర్, అరుణ్, పిఆర్‌ఓగా ముబారక్, ఏపీఆర్‌ఓగా షఫీ, సభ్యులుగా వెంకటాద్రి, మోహనకృష్ణ, ఫిరోజ్, వినోద్, శివచంద్ర క్రాంతిలు ఎన్నికయ్యారు. మొబైల్స్ సేల్స్, సర్వీస్ దుకాణాల యజమానుల సమస్యల పరిష్కారంకై అసోసియేషన్ కలిసికట్టుగా పనిచేస్తుందని వారు తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కేవిబిపురం

మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షా సామగ్రి పంపిణీ పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాల ఉషా, మోడల్‌స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, అజిత్‌గురాజీ, జయకుమార్ పాల్గొన్నారు.

శాశ్వత తాగునీటి కోసం 'అడవిపల్లి రిజర్వాయర్'ను పూర్తి చేయాలి

జడ్జితో చర్చించిన చిత్తూరు స్మార్ట్‌సిటి డెవలప్‌మెంట్ సొసైటీ

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: చిత్తూరు శాశ్వత తాగునీటి పథకం అందించేందుకు అడవి పల్లి రిజర్వాయర్ పూర్తి చేసే ప్రక్రియ నిమిత్తం గురువారం సాయంత్రం జిల్లా కోర్టులో సంబంధిత జిల్లా పబ్లిక్ హెల్త్ కార్యాలయ డిఈ పుష్పగిరి నాయక్, సిఎస్‌సిడిఎస్ బృందం జిల్లా సీనియర్ జడ్జి కరుణ కుమార్ ను కలిసి చర్చించారు. డిఈ సంబంధిత ఫైల్ ను జడ్జికి చూపించారు. అప్పుడే జడ్జి ఫోన్లో సంబంధిత ఎస్సీ హెచ్‌ఎన్‌ఎస్ నెల్లూరు, మదనపల్లి లతో సంభాషించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగర ప్రజల శాశ్వత త్రాగునీటి పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.. వారిద్దరూ సానుకూలంగా స్పందించారు. నగర ప్రజల తాగునీటి కోసం జడ్జి సైతం..వారి ప్రత్యేక కృషికి చిత్తూరు స్మార్ట్ సిటి డెవలప్‌మెంట్ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రసిడెంట్ తాండవ మూర్తి, మల్లికార్జున రావు జర్నలిస్టులు సత్య, కృష్ణ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపి నాయక్ పాల్గొన్నారు.



చిత్తూరు తాగునీటి సమస్యలపై జడ్జితో చర్చిస్తున్న స్మార్ట్‌సిటి బృందం.

మానవత్వానికి హద్దులు లేవు

మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ సిరాజ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: దేశాలకు హద్దులున్నా మానవత్వానికి ఎలాంటి హద్దుల్లేవని మోటివేటివ్ స్పీకర్ బ్రదర్ సిరాజ్ అన్నారు. చిత్తూరులోని కార్పొరేటర్ అలీ నివాసంలో బ్రదర్ సిరాజ్‌కి గురువారం తేనీటి విందును ఏర్పాటు చేశారు. తేనీటి విందు అనంతరం బ్రదర్ సిరాజ్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, అయితే మతాలు, జాతుల పేరిట అంతరాలు సృష్టించుకోవడం తగదన్నారు. ప్రపంచంలో అన్ని మతాల సారాంశం ఒక్కటేనన్నారు. ప్రతి ఒక్కరూ కృతజ్ఞతాభావం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగరంలోని పలు మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.



చిత్తూరు కార్పొరేటర్ అలీతో సిరాజ్ బాయ్

రాయలసీమకు సాగు నీరిచ్చి ఆదుకోవాలి

మాజీ ఎంపీ చింతా మోహన్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రాయలసీమకు సాగు నీరు ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు గోదావరి, కృష్ణ నీరు తీసుకురావడానికి వేయి సంవత్సరాలు తర్వాత రాబోతుందేమో అన్నారు. రాయలసీమలో నీరు లేక రైతులు భూములను బీడు భూములుగా వదిలేస్తున్నారని, ఉపాధి లేక యువత చిన్న చిన్న పరిశ్రమలకు పరిమితమవుతున్నారని, మీ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తిరుపతిని రాజధానిగా చేయాలని రాయలసీమలోని ముగ్గురు ముఖ్యమంత్రులు తిరుపతి గురించి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. టిడిపిలో చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ లీడర్ కిరణ్ కుమార్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమ వాసులుగా రాయలసీమకు న్యాయం చేయలేదని తెలిపారు. ఉమ్మడి మద్రాసిలుగా ఉన్నప్పుడు అప్పట్లో రాజధాని తిరుపతి అని నిర్ణయించినా దాన్ని కర్నూలుకు తరలించాలని, ఇప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు విజయవాడ పాటిస్తున్నారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైజాగ్‌కు రాజధాని అని ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. రాయలసీమకు తాగునీటి న్యాయం జరగాలంటే తిరుపతి రాజధాని కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరదేశి, కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత చింతా మోహన్

గంగాధర నెల్లూరు: తిరుపతిని రాజధానిగా చేస్తేనే రాయలసీమ అభివృద్ధి చెందుతుందని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. గంగాధర నెల్లూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి చెందాలంటే తిరుపతి రాజధానిగా అయితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల మీద దాడులు, పిసిసి అధ్యక్షురాలు షర్మిలను అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి పరదేశి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిరంజీవి, మండలా కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రబాబు, తులసిమణితో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రధానోపాధ్యాయుల ఉద్బోధ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యార్థులుఉన్నతశిఖరాలకుచేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు భేరీనాథ్ అన్నారు. గురువారం మండలంలోని గుండ్ల కట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్యార్థులు వెళ్లడం ఆనందంగా ఉందని, రాబోవు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి మంచి పేరు తీసుకురావాలని సమాజంలో ఉత్తమంగా మెలిగి అందరి మన్ననలు పొందాలన్నారు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాం, పద్మనాభ రెడ్డి, సురేష్, పలువురు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు



కవలలతో క్యాంఫర్డ్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

ఘనంగా కవలల దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

స్థానిక గంగనపల్లిలోని క్యాంఫర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల్లో గురువారం కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిత్తూరు నగరంలోని క్యాంఫర్డ్ పాఠశాలల్లోని కవలలను ఓ చోటకు చేర్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల హెచ్‌ఎంలు అరుణ్‌కుమార్, భారతి, సురేష్, వినోద్‌కుమార్‌లతో పాటు కోఆర్డినేటర్లు, ఉపాధ్యానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మామిడిలో అంతర పంట సాగు లాభదాయకం'

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని నందనూరు పాపిరెడ్డి పల్లి పంచాయతీలలో ని పంట పొలాలను గురువారం చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్లు నాగమణి రాఘవేంద్ర లు కలిసి పొలాలను సందర్శించారు.ఈ క్షేత్రస్థాయి సందర్శనలో మామిడి ,వేరుశనగ, మిరప పంటల తెగులు నివారణ చర్యలను రైతులకు సూచించారు.మామిడిలో పూత పిందె దశలో ఉన్న తోటలకు తేనె మంచు పురుగు, మసి తెగులు ఉన్నట్లు గమనించి వాటి నివారణకు భూ ప్రో పూజిక్ ఒక మి. మి,కి లీటరు నీటిని కలుపుకొని మరియు హేక్జా కొనజోల్ 2 మి. మి కీఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మామిడి మిరప తోటలకు తెగులు నివారణకు సరైన మందులను పిచికారి చేయడం వల్ల త్వరగా రోగ నివారణ చర్యలు చేపట్టవచ్చని రైతులకు సూచించారు .మామిడిలో అంతర పంటలుగా అలసంద ,వేరుశనగ, ఆనప సాగు చేసుకోవడం వలన అధిక ఆదాయం



అంతర పంటను పరిశీలిస్తున్న డాక్టర్లు నాగమణి, రాఘవేంద్ర

పొందడంతోపాటు భూమి సారం పెంపొందించుకోవచ్చని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు చక్రవర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

అందరి త్యాగాలు మరువలేనివి

- మృతుల కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-పులిచెర్ల: 'మీ అభిమానాలు, త్యాగాలు ఎన్నటికీ మరువలేనివి' అని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. గత ఏడాది చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక పులిచర్ల మండలం కమ్మపల్లికి చెందిన టిడిపి వీరాభిమాని వెంకటపతి నాయుడు, గడ్డం వారి పల్లి పంచాయతీ పగడాల వారి పల్లికి చెందిన టిడిపి నాయకులు దొరస్వామి మృతి చెందడంతో గురువారం ఆ కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించారు. ముందుగా కమ్మపల్లికి చేరుకున్న నారా భువనేశ్వరి కి గ్రామంలోని మహిళలు ఘన స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. అనంతరం వెంకటపతి నాయుడు ఇంటికి చేరుకున్న నారా భువనేశ్వరి ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి మూడు లక్షల చెక్కున అందజేశారు. ఈ సందర్భంగా రామాలయం ముందు ఏర్పాటుచేసిన సమావేశంలో నారా భువనేశ్వరి ప్రసంగించారు. చంద్రబాబు నాయుడు పై మీరు పెట్టుకున్న నమ్మకం గౌరవం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు ప్రతి ఒక్కరు చేయి చేయి కలిపి టిడిపిని గెలిపించాలన్నారు భావితరాల భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు నిరంతర కృషి చేస్తున్నారని తెలిపారు మృతుల కుటుంబాలకు నారా కుటుంబం ఎన్నటికీ రుణపడి ఉంటుందని ఆమె తెలిపారు అనంతరం గడ్డం వారి పల్లి పంచాయతీ పగడాల వారి పల్లి చేరుకున్న నారా భువనేశ్వరి దొరసామి కుటుంబ సభ్యులతో మాట్లాడారు వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు అనంతరం మృతుడి భార్య వరలక్ష్మికి మూడు లక్షల చెక్కును అందజేశారు ఈ కార్యక్రమంలో పుంగనూరు, పీలేరు, చంద్రగిరి నియోజకవర్గాల టిడిపి ఇన్చార్జిలు చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పులివర్తి నాని మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐరాల: పూతలపట్టు నియోజకవర్గంలో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడుని వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిన సమయంలో ఆ అన్యాయాన్ని చూసి భరించలేక కొందరు అభిమానులు గుండెపోటుతో మరణించారు. చంద్రబాబు నాయుడుకి వీరాభిమానులైన అమరుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. నారా భువనేశ్వరి. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా పాటూరు గ్రామంకు చేరుకున్న నారా భువనేశ్వరికి పూతలపట్టు టిడిపి, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరై భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. నారా భువనేశ్వరి గారి రాకతో ఒక్కసారిగా జై టిడిపి నినాదాలతో పాటూరు గ్రామం హోరెత్తింది. అనంతరం రోడ్డు మార్గం గుండా ఐరాల మండలం, చింతగుబ్బలపల్లె గ్రామానికి నారా భువనేశ్వరి చేరుకుని జయప్రకాష్ కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. జయప్రకాష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రూ. 3 లక్షల రూపాయలను తక్షణ ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో నారా భువనేశ్వరితో పాటుగా టీడీపీ జనసేన ఉమ్మడి పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్, మండల అధ్యక్షులు గిరి నాయుడు, జిల్లా, మండల, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిడి నెల్లూరులో ఉదయం ఎనిమిది గంటలవుతున్నా మంచు కురుస్తున్న దృశ్యం

పగలు సెగ..రాత్రి చలి!

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు : ఫిబ్రవరి నెలలోనే వేసవి మొదలైనట్లు కనిపిస్తోంది. పగటివేళ విపరీతమైన ఎండలే ఇందుకు నిదర్శనం. మధ్యాహ్నం 12 గంటలైతే బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. అయితే సాయంత్రం మాత్రం చలి వేస్తోంది. గురువారం ఉదయం 8 గంటలకు గంగాధర నెల్లూరు పొగ మంచు విపరీతంగా కురుస్తుండడంతో వాహన దారులు నడిపేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

అయూబ్ ఖాన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు కు చెందిన ప్రముఖ సామాజికవేత్త, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ వ్యవస్థాపకులు పి. అయూబ్ ఖాన్ గౌరవ డాక్టరేట్ వరించింది. తెలంగాణకు చెందిన స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ సికింద్రాబాద్ వారు సామాజిక సేవ మతసామరస్యం, పరమతసహనం పై ఆయన చేస్తున్న కృషిని గుర్తించి యూనివర్సిటీ డైరెక్టర్ మార్టిన్ కర్టిగా ఈ గౌరవ డాక్టరేట్ ను తెలంగాణలోని సికింద్రాబాద్ లో గురువారం అందించారు. సామాజిక సేవతోపాటు మతసామరస్యాన్ని ప్రోత్సహించడంతో పాటు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఆయనను గౌరవ డాక్టరేట్ కు ఎంపిక చేశారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి అయూబ్ ఖాన్ కు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు, అభినందనలు తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న అయూబ్‌ఖాన్

'అమృత్ వికసిత్ భారత్' పై అవగాహన

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యా సంస్థలు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, అఖిలభారత సాంకేతిక విద్యా మండలి సూచనల మేరకు అమృత్ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ సదస్సులో చెన్నైకి చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్, శాస్త్రవేత్త వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మన దేశం అభివృద్ధి పథంలో ఎలా పరుగుడుతుంది? అందుకోసం ఇంజనీరింగ్ విద్యార్థులు ఎలా కృషి చేయాలి అనే అంశంపై వివరించారు. కరస్పాండెంటు రవీంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అది కొద్ది కళాశాలలో మదర్ థెరిసా కళాశాల ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని ఒక విద్యార్థి ఈ విషయాన్ని గుర్తుంచుకొని దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అధిక రాజేందర్ రెడ్డి, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న గురజాల జగన్మోహన్

జిజేఎం దాతృత్వం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 8వ వార్డు పేద కుటుంబానికి చెందిన మనోజ్ తన కుమారుడు సుశాంత్ (7) తీవ్రమైన కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఇంటి వద్దే ఉండి చికిత్స పొందుతున్న విషయాన్ని ఆ కుటుంబం టిడిపి చిత్తూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు గురజాల జగన్ మోహన్ దష్టికి తీసుకెళ్లడంతో మానవతా దక్పథంతో స్పందించి, మెరుగైన చికిత్స కొరకు లక్ష రూపాయల ట్రస్ట్ తరపున ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిజెయం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కావాలని ప్రజలు కోరుతున్నారు: మాజీ ఎంపీ

ప్రజాశక్తి-కుప్పం: 'రావాలి కాంగ్రెస్ కావాలి కాంగ్రెస్'అని దేశ ప్రజలు కోరుతున్నారని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ తెలిపారు. ఆయన గురువారం నాడు కుప్పం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని రహదారులు మరియు భవనాల శాఖ అతిధి గృహంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని తిరుపతి నగరాన్ని రాష్ట్ర రాజధానిగా చేయాలని కోరారు. రాయలసీమలో మొత్తం 10 జిల్లాలు ఉన్నాయని, అందులో ఒక్క తిరుపతి నగరం 7 జాతీయ రహదారులతో, 7 గొప్ప విద్యాసంస్థలతో, లక్ష ఎకరాల ప్రభుత్వ భూమితో రాజధాని అవసరమైన అన్ని సౌకర్యాలు కలిగి ఉన్న నగరమని తెలిపారు. కావున అలాంటి నగరాన్ని రాజధానిగా ప్రకటించాలని సూచించారు. 35 సంవత్సరాలు వరుసగా కుప్పం శాసనసభ్యులుగా ఉంటున్న చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా సైతం రాష్ట్రానికి సేవలు అందించారని, అయినా ఆయన హయాములో రాష్ట్రం ఏమాత్రం అభివృద్ధి చెందాలేదని ఆరోపించారు. చంద్రబాబు పాలనను చూసిన ప్రజలు వైసీపీని గెలిపించుకొని జగన్మోహన్ రెడ్డి పాలనను సైతం చూశారని, వీరిద్దరి పాలనపై విసుగు చెందిన జనం ఇప్పుడు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, జిల్లా కార్యదర్శి కలికిరి చిరంజీవి, పూతలపట్టు ప్రభాకర్, పలనీ, ఇర్ఫాన్, గోవిందా, నిజాం, సంతోష్ పాల్గొన్నారు.

మరమగ్గ కార్మికులకు తీపి కబురు

- విద్యుత్ ఛార్జీలు తగ్గింపు- ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ట్రాన్స్‌కోలో కేటగిరి 4లో కుటీర పరిశ్రమగా ఉన్న నేతను గత ప్రభుత్వం కేటగిరి 3కు మార్చివేసింది. ఆ ప్రభుత్వ నిర్వాకం చాపకింద నీరుల పాకుతూ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మరమగ్గ నేత కార్మికులకు శాపంలా పరిగణించింది. విద్యుత్ బిల్లులు అకస్మాత్తుగా పెరిగే సరికి నేత పరిశ్రమవారు విలవిలలాడిపోయారు. పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి ఆర్కేరోజా గత ప్రభుత్వంలో జరిగిన పొరపాటును గుర్తించారు. అయితే కేటగిరి మార్పు అన్నది ముఖ్యమంత్రి స్థాయిలో చేపట్టాల్సిన అంశం కావడంతో గత ఏడాది ఆగష్టు నెల 28వ తేదీన ముఖ్యమంత్రి జగనన్న విద్యాదీవెన లాంఛనంగా ప్రారంభించేందుకు నగరిలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. మరమగ్గకార్మికుల పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నా చెల్లెలు అడిగింది విద్యుత్ బిల్లులు తగ్గిస్తాను అని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట తప్పని జగనన్న నేడు ఆ హామీని నిలబెట్టుకున్నారు. మరమగ్గ కార్మికులకు సంబందిత ఎలక్ట్రిసిటీ డ్యూటీని యూనిట్‌కు రూ.1 నుంచి ఆరుపైసలు తగ్గించినట్లు ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీ కె.విజయానంద్ గురువారం జీవోను విడుదల చేశారు. మరమగ్గ కార్మికులకు తీపికబురును అందించారు. దీంతో నేతసామాజిక వర్గాల వారి ఇంట ఆనందోత్సాహాలు నిండాయి.